# ప్రజావాణి పిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి

## -డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, రఘుప్రసాద్ తదితరులు

**హైదరాబాద్ మే 5,ప్రభాతవార్త :** ప్రజావాణి లో వచ్చిన పిర్యాదుల పై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటి మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో నిర్వహించే ప్రజావాణిలో పాల్గొని విన్నపాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంభందిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుండి పలు సమస్యల ను సాధ్యమైన మేరకు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ కమీషనర్ అనురాగ్ జయంతి , రఘుప్రసాద్, వేణు గోపాల్‌రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, పంకజ గీతా రాధిక, టౌన్ ప్లానింగ్ అడిషనల్ సిసిపిలు, వీరన్న ప్రదీప్ ప్రజల నుండి విన్నపాలను ను స్వీకరించారు. ఈ సందర్బంగా అడిషనల్ కమీషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ నగర ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కారం కోసం వినతులు పై వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 171 దరఖాస్తులు వచ్చాయని అందులో టౌన్ ప్లానింగ్ విద్యుత్ దీపాలు, తదితర సమస్యల పై ప్రజలు విన్నపాలను అందజేశారన్నారు. హెడ్ ఆఫీస్ లో మొత్తం 75 విన్నపాలు రాగా అందులో 70 దరఖాస్తు లు రాగా టెలిఫోన్ ద్వారా 5 విన్నపాలు వచ్చాయి అన్ని జోనల్ తో కలిపి 96 విన్నపాలు స్వీకరించారు. సికింద్రాబాద్ జోన్ లో 30, చార్మినార్‌లో 2 , ఎల్ బి నగర్ 11, కూకట్ పల్లి 32, ఖైరతాబాద్ 03, శేరిలింగంపల్లి జోన్ లో 18 విన్నపాలు స్వీకరించారు. ఈ సమావేశంలో చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, యుబిడీ డైరెక్టర్ వెంకటేశ్వర్ , వాటర్ వర్క్స్ డి జి ఎం సాయి రమణ, విద్యుత్ శాఖ ఇంచార్జ్ యస్ఈ మమత, హౌసింగ్ ఈఈ పివి రమణ, రాజేశ్వర్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

# నగరానికి మిస్ వరల్డ్ సుందరీమణులు

## -విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటకశాఖ ఏర్పాట్లు


ఎయిర్‌పోర్టులో మిస్ పోర్చుగల్ మారియా అమెలియా ఆంటోనియోకు సంస్కృతి,సాంప్రదాయాలకు అనుగుణంగా స్వాగతం పలుకుతున్న దృశ్యం



**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త :** మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల సుందరీమణులు నగరానికి చేరుకుంటున్నారు. సోమవారం మిస్ పోర్చుగల్ మారియా అమెలియా ఆంటోనియో నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన మిస్ పోర్చుగల్‌కి అధికారులు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతించి, సత్కరించారు. అలాగే ఇదేరోజు మిస్ ఘనా జుట్టా అమా పోకుహ్ అడ్డో, మిస్ ఐర్లాండ్ జాస్మిన్ జెర్హార్డ్‌లు సైతం హైదరాబాద్ చేరుకోనున్నారు. మిస్ పోర్చుగల్ మారియా అమెలియా ఆంటోనియో ఈ నెల 10న ప్రారంభ కార్యక్రమం ఉండనుంది. ఆదివారం బ్రెజిల్, దక్షిణాఫ్రికాలకు చెందిన జెస్సికా ఫెడ్రోసో, జోయిలెజ్ జాన్సెన్ వాన్ రెన్స్‌బర్గ్‌లు నగరానికి వచ్చారు. శనివారం మిస్ కెనడా ఎమ్మా మోసరిన్ హైదరాబాద్ చేరుకున్నారు. వీరికి శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. మంగళ, బుధవారాల్లో మిగిలిన దేశాలకు చెందిన సుందరీమణులు హైదరాబాద్‌కు రానున్నారు. మిస్‌వరల్డ్ ఛైర్‌పర్సన్ జూలియా మోర్లీ మూడు రోజుల క్రితమే రాగా పోటీల నిర్వాహకులు జోనాదన్ మార్క్‌షా ఆదివారం చేరుకున్నారు. జోయిలెజ్‌జాన్సెన్ వాన్ రెన్స్‌బర్గ్(దక్షిణాఫ్రికా) అభివాదం ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీ పడనున్న 120 మంది అందగత్తెలు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ప్రముఖ ప్రదేశాలను సందర్శించనున్నారు. పోటీలను కవరేజ్ చేయడం కోసం వస్తున్న వందకుపైగా దేశాలకు చెందిన జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, ఇతర ప్రతినిధులు దాదాపు మూడు వారాలపాటు రాష్ట్రంలోనే ఉండనున్నారు. ఈ క్రమంలో విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర పర్యాటక విధానం రూపొందించాక జరుగుతున్న అత్యంత కీలకమైన కార్యక్రమంగా దీన్ని ఆ శాఖ భావిస్తోంది.

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు..** సుందరీమణులు పాల్గొనే వేదికలతోపాటు వారు భాగస్వాములయ్యే, సందర్శించే ప్రదేశాల్లో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. ప్రారంభ కార్యక్రమానికి వేదికైన గచ్చిబౌలి స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తయారుచేస్తున్నారు. స్టేడియం లోపల కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాట్లు, ప్రత్యేక అలంకరణలు చేశారు.

# సర్కార్ దవాఖానాలో రేబిస్ వ్యాక్సిన్ కొరత

## -కుక్కకాటుకు వైద్య సేవలు అందని ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులు



**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త:** కుక్కకాటు బాధితులకు నగరంలో పేరుపొందిన గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో వైద్యం అందడం లేదు. ఈ ప్రధాన సర్కార్ దవాఖానలో కనీసం రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ ప్రధాన అస్పత్రులలో కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా వైద్య సేవలు అందుతున్నప్పటికి మరికొన్ని రకాల వైద్య సేవలు అందించాల్సిన అవసరాన్ని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అనేక రకాల వైద్య సేవలు అందుతున్నాయి. కొన్నిసార్లు కార్పొరేట్ ఆస్పత్రులలో కూడా అందించలేని సేవలను ప్రభుత్వ ఆస్పత్రులలో అందజేస్తున్నారు. కరోనా లాంటి సమయంలో కూడా ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు ప్రాణాలను ఫణంగా పెట్టి అత్భుతమైన సేవలు అందించి అనేక మంది ప్రాణాలను కాపాడారు. అయినప్పటికి ప్రజలకు మరిన్ని రకాల వైద్య సేవలను అందిస్తే బాగుండేదని ప్రజల నుంచి డిమాండ్‌లు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా బీపీ, షుగర్ లాంటి క్రానిక్ వ్యాదులు ఉన్నవారు కొన్నిసార్లు వైద్య సేవలు పొందుతున్నప్పటికి పలు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రేబిస్ లాంటి టీకాలు తీసుకునే సమయంలో ఆందోళన చెందుతున్నారు. కుక్క కాటుకు టీకాలు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కకాటుకు గురైన వారు టీకాలు తీసుకోడానికి సందేహపడుతున్నారు. గాయమైన కాలు షుగర్ ఉన్నవారికి అంత తేలిగ్గా నయం కావడం లేదని, వైద్యులు ప్రత్యేకంగా ఎలాంటి పరీక్షలు జరుపకుండానే టీకాలను వేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, ఉస్మానియా ఆస్పత్రులలో కూడా కుక్కకాటుకు వైద్య సేవలు అందించాలని బాధితులు కోరుతున్నారు. ఒకవైపు ఇతర జబ్బులకు వైద్య సేవలు పొందుతూనే కుక్కకాటు వైద్యానికి ఐపీఎంకు వెళ్ళాల్సి రావడం ఇబ్బందికరంగా మారిందని అంటున్నారు.

**ఐపీఎంలో వైద్య సేవలు...**

కుక్కకాటుకు గురైన వారు నారాయణగూడలోని ఐపీఎం (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్) లో వైద్య సేవలు పొందుతున్నారు. కుక్క కరిచిన నెల రోజుల వ్యవధిలో ఐదు టీకాలను అందజేస్తున్నారు. ఇది మాత్రమే కాకుండా కుక్కకాటుకు గురైన వ్యక్తి మొదటిసారి ఐపీఎంలో టీకా వేయించుకున్న అనంతరం వెంటనే నల్లకుంటలోని ఫివర్ ఆస్పత్రిలో తప్పనిసరిగా ఇమ్యూనోగ్లోబ్యులిన్ ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా నారాయణగూడలోని ఐపీఎంలో ఇంజక్షన్ తీసుకున్న వ్యక్తి నల్లకుంటలోని ఫివర్ ఆస్పత్రికి వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. వృద్దులు, వికాలాంగులు రెండుచోట్లకు తిరగాల్సి రావడం పట్ల చికాకు పడుతున్నారు. పైగా వ్యయ ప్రయాసలకు గురవ్వాల్సి వస్తోందని అంటున్నారు. కుక్కకాటుకు గురైన వ్యక్తికి ఇతర జబ్బులు ఉన్నప్పటికి తప్పనిసరిగా యాంటీ రేబిస్ ఇంజక్షన్‌లు తీసుకోవాలా వద్దా అనే సందేహాలు వెలువడుతున్నాయి. ఐపీఎంలో వైద్య సేవలు అందించే వైద్యులు ఇలాంటి సందేహాలకు రకరకాల సమాదానాలు చెబుతుండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన అస్పత్రులైన సికింద్రాబాద్ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులలో కూడా కుక్కకాటుకు టీకాలు వేయగలిగితే ఉపయోగకరంగా ఉంటుందని, ఇతర జబ్బులకు అందించినట్లుగానే కుక్కకాటుకు కూడా వైద్య సేవలు అందించగలిగితే రోగులకు ఇప్పలు తప్పుతాయని చెబుతున్నారు. అంతే కాకుండా ఐపీఎంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకే వైద్య సేవలు అందుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలా వచ్చారో అలాగే వెనక్కి వెళ్లే పరిస్థితులు నెలకొంటున్నాయి.

**పెరుగుతున్న కుక్కకాటు బాధితులు....**

రోజురోజుకు కుక్కకాటు బాధితులు పెరిగిపోతున్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో వీరి సంఖ్య నానాటికి పెరుగుతోంది. కొన్నిసార్లు వీధుల్లో తిరగాలంటేనే జంకుతున్నారు. వేసవి కాలం కావడం వల్ల చిర్రెత్తిన కుక్కలు వీధుల్లో తిరుగుతున్న వారి పిక్కలను అందుకుంటున్నాయి. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే వేల సంఖ్యలో రోగులు ఐపీఎంకు క్యూలు కడుతున్నారు. కుక్కకాటుకు గురైన వ్యక్తుల అప్పటికప్పుడు ఏం చేయాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఈ యేడాది ఆరంభం నుంచే నారాయణగూడ ఐపీఎంలో కుక్కకాటు బాధితుల సంఖ్య నెలనెల మూడు వేలకు తగ్గకుండా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 11 వేల కుక్కకాటు బాధితులు ఆస్పత్రిని ఆశ్రయించినట్లు తెలిపారు. కుక్కలు కనిపిస్తే చాలు పిక్కబలం చూపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని బాధితులు చెబుతున్నారు.

**కుక్క కాటుకు వైద్యుల సలహాలు....**

కుక్క కాటుకు గురైన వ్యక్తులు ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా నల్లా నీటి దారతో కుక్క కరిచిన చోటా గాయాన్ని కడగాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వీధీ కుక్కలు కరిస్తే వెంటనే ఆస్ప త్రిని సందర్శించడం ముఖ్యమని చెబుతున్నారు. వైద్య తీసుకుంటున్నప్పటికి కరిచిన కుక్కను తర చుగా గమనిస్తూ ఉండాలంటున్నారు. కరిచిన కుక్క చనిపోతే వైద్యులకు తప్పనిసరిగా తెలియజేయాల ని సూచిస్తున్నారు. కుక్క కాటును ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలు పొందాలని చెబుతున్నారు. కుక్క కరిచిన పక్షంలో తలనొప్పి, అలసట, కండరాల నొప్పులు, జ్వరం, గాయం వద్ద దురద, తిమ్మిరి, మంట లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచి స్తున్నారు. వీటిని రేబిస్ లక్షణాలుగా చెబుతున్నారు.



# హైదరాబాద్ వార్త

# చెరువులు, కుంటలపై హైడ్రా ఫోకస్

**-వాటితోపాటు సర్కారు స్థలాల పరిశీలన**
**-ప్రజావాణి ఫిర్యాదుల ఆధారంగా ముందుకు**
**-క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న బృందాలు**
**-కబ్జాకు గురైన స్థలాలు, పార్కులపై ఆరా**
**-అనుమతులు ఇచ్చిన అధికారుల వివరాలు సైతం సేకరణ**


బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్ (ఫైల్)

**హైదరాబాద్, మే 5,ప్రభాతవార్త:** చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా దూకుడు పెంచుతుంది. నగర శివార్లలోని చెరువులు, కుంటలు, నాలాలతో పాటు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను పరిశీలించేందుకు హైడ్రా బృందాలు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదలకు ఆధారంగా స్థల పరిశీలన చేస్తున్నాయి. అంతేకాక సుదీర్ఘకాలంగా కబ్జాలకు గురవుతున్న చెరవులు, కుంటలు, ఇతర జలాశయాలను పరిశీలించేందుకు గుట్టుచప్పుడుకాకుండా పర్యటిస్తున్నాయి. చెరువులు,కుంటలు, ప్రభుత్వ ఆస్థులను సర్వే చేస్తూ వివరాలు సేకరిస్తున్నారు. ఏచెరువు ఎంతకబ్జాకు గురైంది..అక్కడ నిర్మాణాలు ఎప్పుడు చేపట్టారు..వాటికి అనుమతిచ్చిన అధికారులు ఎవరూ ..ఇలా అన్నికోణాల్లో సర్వే చేస్తున్నారు. హైడ్రా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇటీవల అదనపు సిబ్బందిని నియమించి విషయం తెలిసిందే. ఈసంఖ్యను మరింత పెంచడంతోపాటు హైడ్రాకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తుంది. దీంతో హైడ్రా మరింత ఉత్సాంగా పనిచేస్తుంది. ఇప్పటికే అక్రమ నిర్మాణాలపై తగ్గేది లేదని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కోర్టులకు వెళ్ళినా కొట్లాడి మరీ కూల్చేస్తామని తేల్చిచెప్పారు. ఇక మధ్య,పేద తరగతి వర్గాల వారికి నష్టం జరగకుండా చూస్తామని హైడ్రా అధికారులు చెబుతున్నారు. నివాసం ఉండే ఇళ్ల జోలికి ఇప్పట్లో వెల్లబోమని ప్రకటించారు. దీంతో తెలుసో తెలియకో ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లలో ఇళ్లు కొనుగోలు చేసిన వారికి ఇది కొంత ఊరట కలిగించే విషయం. అయితే కొందరు బిల్డర్లు దొడ్డిదారిన హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అనుమతులు తీసుకుని నివాస సముదాయాలను నిర్మించి అమ్మేశారు.

**పర్మిషన్ ఇచ్చిందెవరూ..**

ఇప్పటికే ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మించిన పలు అక్రమ కట్టడాలను గుర్తించి నేలమట్టం చేసింది. ఇందులో హీరో నాగార్జునతోపాటు మరి కొందరు ప్రముఖుల కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. ఇలా అక్రమ కట్టడాల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గకుండా దూకుడు ప్రదర్శిస్తుండటంతో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఎక్కడికక్కడ అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తున్న హైడ్రా అందుకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపైనా యాక్షన్ తీసుకునేందుకు సిద్దమువుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఆరుగురు ఆధికారులపై సైబరాబాద్ పరిధిలో కేసులు కూడా నమోదయ్యాయి. కూల్చివేతల సమయంలో హెచ్ఎండీఏ, ఇరిగేషన్ శాఖ అనుమతి ఇవ్వడంతోనే తాము కట్టడాలు చేపట్టామని భవన నిర్మాణదారులు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. దీంతో గవర్నమెంట్ ల్యాండ్స్, ఎప్టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో కట్టడాలకు అనుమతిచ్చిన అధికారులు ,క్షేత్రస్థాయి సిబ్బంది వివరాలను హైడ్రా సేకరిస్తుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో పర్మిషన్ ఇచ్చిన అధికారుల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయి. హైడ్రా ఏక్షణం ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందోనని అధికారులు , క్షేత్రస్థాయి సిబ్బంది టెన్షన్‌తో వణికిపోతున్నారు.

# ప్రజలను మభ్య పెట్టడానికే కుల గణన

## - ఎఐసిసి కార్యదర్శి విష్ణునాథ్


సమావేశంలో ప్రసంగిస్తున్న మైనంపల్లి హనుమంతరావు

**అల్వాల్, మే 5 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడం కాంగ్రెస్ పార్టీ ఒత్తిడే కారణమని ఎఐసిసి కార్యదర్శి విష్ణునాథ్ పేర్కొన్నారు. సోమవారం అల్వాల్ విబిఆర్ గార్డెన్స్‌లో మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం జరిగింది. అంతుకు ముందు నియోజకవర్గం ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆద్వర్యంలో పట్టణ పరిధిలో భారీ ర్యాలీ నిర్వహించారు. గోల్నాక అల్వాల్ నుంచి ఓల్డ్ అల్వాల్ వరకు జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు కదం తొక్కారు. అంతకు ముందు గోల్నాక అల్వాల్‌లో రాజీవ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. జై భీమ్.జై బాపు, జై సంవిధాన్‌ను విజయవంతం చేసిన నేపథ్యంలో పార్టీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కుల గణన దేశానికి దిశ నిర్ధేశం కాంగ్రెస్ పార్టీ వలనే సాధ్యమైందని కొనియాడారు. చట్టాలను గౌరవించడం కేంద్ర ప్రభుత్వం మరిచి పోయిందన్నారు. కులాలు, జాతులు మద్య విభేదాలు సృష్టించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో జనరంజకమైన పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నాయకులు, కార్యకర్తలు సిద్దంగా ఉండాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వానికి మరింత బలం చేకూర్చడానికి కష్టించి పని చేయాలని కోరారు. జిహెచ్ఎంసి ఎన్నికలులో అధిక డివిజన్లు కైవసం చేసుకునే దిశగా సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నేతలు కూన శ్రీశైలం గౌడ్, సుధీర్ రెడ్డి, వజ్రేష్ యాదవ్. పరమేశ్వర్ రెడ్డి, బండి రమేష్,నర్సా రెడ్డి, భాస్కర్, నక్కా ప్రభాకర్ గౌడ్, ఉస్మా షకీరా, శోభనాయుడు,లక్ష్మీకాంత్ రెడ్డి, అశోక్ రెడ్డి కార్పొరేటర్ జితేందర్‌నాథ్, చంద్రశేఖర్, సురేందర్ రెడ్డి, సంజీవ్ కుమార్, వీనస్ మేరీ ఇతరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి సత్యనారాయణ స్వామి దేవాలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు


అశోక్‌నగర్ సత్యనారాయణ స్వామి దేవాలయం

**చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త:** అశోక్‌నగర్ శ్రీశృంగేరి జగద్గురు మహాసంస్థానము రమాసహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం ఫౌండర్ ట్రస్టీ పల్లెంపాటి వెంకటేశ్వర్లు తనయుడు పల్లెంపాటి వీరయ్య, ఆలయం ధర్మాధికారి వివరించారు. జగదునగరు శంకరాచార్య దక్షిణామ్నాయ శారదాపీఠేశ్వర అనంత, భారతీతీర్థమహాస్వా మి, విధుశేఖర భారతీతీర్థసాన్వమివారి ఆశీర్వ అనుగ్రహంతో 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. 6న స్వామివారికి చతుర్ధశ కలశ స్థాపన, 7న ఉదయం సేవాకాలము (తిరు ప్పావై), స్వామివారిని పెండిల్ల కుమారుని చేయడం, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణము, యాగ శాల ప్రవేశము, విష్వక్సేనపూజ, పుణ్యా హవాచనము, రుత్విగ్వరణము, అఖండ దీపారాధన, అంకురారోహణము, నవకుంభారోహణము, అగ్నిప్రతిష్టాపనాది హోమాదికాలు, బ్రహ్మోత్సవాల ప్రారంభసూచకంగా ధ్వజారోహణము, నీరాజన, మంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాద వితరణ ఉంటుంది. 7న ప్రతి రోజు జరిగే కార్యక్ర మాలతో పాటు సాయంత్రం ఎదురుకోలు సన్నాహము, శ్రీవారి కల్యాణమహోత్సవం కన్నులపం దువగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. 9న సేవాకాలము తిరుప్పావై, హోమాది కాలు, బలిహరణ, శ్రీవారి రథోత్సవం, గ్రామోత్సవం (ఊరేగింపు), అవబృంధస్నానములు వసంతో త్సవములు, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణము, ధ్వజారహణము, ద్వాదశ ప్రదక్షిణలు, చతుర్వేద పారాయ ణ పండిత సత్కారం, యాజమాన ఆశీర్వచనము, నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ శ్రీపుష్పయాగోత్సవము(పవళింపుసేవ), ఉత్సవపరిసమాప్తి అవుతాయన్నారు.

# పని చేస్తున్న ఇంటికే కన్నం

## -మహిళ అరెస్ట్ ,బంగారు ఆభరణాలు స్వాధీనం

**కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త :** పనిచేస్తున్న ఇంటికే కన్నం వేసిన ఓ మహిళాను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. బోయినపల్లి ఇన్స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాలప్రకారం గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చేందిన కంచర్ల సువర్ణ (48 )జగద్గిరిగుట్టలో నివాసం ఉంటుంది. గత ఆరు నెలల కిందట బోయినపల్లి ఆనంద్‌నగర్ కాలనీలోని శివరాం కృష్ణ ఇంటిలో తన అత్తమ్మకు కేర్ టేకర్ ఉండడంతో పాటు పనిమనిషిగా పనిలో చేరింది. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో సదరు వృద్దురాలు నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఇంట్లో ఉన్నా బంగారు నగలతో పాటు ఓ సెల్ ఫోన్‌ను దొంగిలించి ఏమి తెలియనట్లు ఇంటినుండి వెళ్లపోయింది. ఆదివారం విషయం తెలుసుకున్న ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. కెసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. సెల్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా ఆమె జగద్గిరిగుట్టలోని ఓ బంధువు ఇంట్లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు సోమవారం ఆమెను అదుపులకి తీసుకుని బోయినపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమె వద్ద నుండి సుమారు రూ.8 లక్షల 20 వేల విలువచేసే బంగారు ఆభరణాలు, ఓ సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తునారు. 24 గంటలలో కేసును చేధించిన పోలీసులను డీసీపీ రష్మీ పెరుమాళ్, ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి లు అభినందించారు

# భార్య అనుమానించిందని మనస్థాపంతో భర్త ఆత్మహత్య

**బేగంపేట మే 5,ప్రభాతవార్త** భార్య తనను అనుమానించిందనే మనస్థాపంతో ఒక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి .బేగంపేట అన్నానగర్ కు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఎ.సాయికుమార్ (23)కు పూజాతో వివాహం జరిగింది. అయితే సాయికుమార్ తమ పక్కింట్లో ఉండే యువతితో తరచుగా మాట్లాడుతుండేవాడు. ఈ క్రమంలో యువతితో కల్సి ఉన్నప్పటి ఫోటోను పూజ చూసింది. ఈ విషయమై సాయికుమార్‌ను పూజ నిలదీసింది. దీంతో మనస్థాపానికి గురైన సాయికుమార్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సాయికుమార్ తల్లి అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సూరారంలో ఫైనాన్సర్ వేధింపులు

## - వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**జీడిమెట్ల, మే 5, ప్రభాతవార్త** మేడ్చల్ జిల్లా సూరారం పిఎస్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. శివాలయనగర్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమని అప్పు ఇచ్చిన వాళ్ల నుండి వత్తిడి బెదిరింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక అప్పు ఇచ్చిన వాళ్ల ఇంటిముందే పెట్రోల్ పోసుకొని శ్రీనివాస్ నిప్పటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతనిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వివేక్ నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.2లక్షల19వేల540

**చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త:** వివేక్ నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. ఆలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. ఏప్రిల్ నెల 30 రోజులకు గాను రూ.2లక్షల 19వేల540 ఆదాయం వచ్చింది. దేవాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంక టాద్రి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్**



ప్రసంగిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవిండ్‌కుమార్ యాదవ్

**చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం గాంధీనగర్‌లోని ఆంధ్రాకేఫ్ వద్ద లక్ష్మీగపతి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు అరవింద్‌కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు అభిషేక్ కెన్నడీ, శీలం సత్యనారాయణ, గుండు జగదీశ్, బాబ్జీ సురేశ్ యాదవ్, బాబురావు, భాస్కర్, హఫీజ్, గిరి, దినేష్, భాను తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభ్యుదయమే ధ్యేయంగా పనిచేస్తోందని, అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలను రూపకల్పన చేశారన్నారు.

### ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గాయని డా.ఇందిర



వరల్డ్ రికార్డ్‌ను నరేందర్‌గౌడ్, అంజనీకుమార్ తదితరుల చేతులమీదుగా అందుకుంటున్న గాయని ఇందిర

**నాంపల్లి, మే 5 ప్రభాతవార్త :** తెలుగు, హిందీ, తమిళం సినిమా పాటల 12 గంటల నిర్విరామ ఆలాపనతో సుదీర్ఘ సినీ గానలహరిలో ప్రఖ్యాత గాయని డా. ఎన్.ఇందిర పేరును ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్-2025లో నమోదు చేసినట్లు సంస్థ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ డా. బింగి నరేందర్‌గౌడ్ ప్రకటించారు. ఒక మహిళ స్వశక్తి సాధనతో సంగీతంలో అద్భుత పట్టు సాధించి విజయం పొందడం గొప్ప రికార్డ్ అని కొనియాడుతూ డా. ఎన్. ఇందిరను ఘనంగా సత్కరించి ధృపపత్రాన్ని అందజేసి ఎంతగానో అభినందించారు. ఈమేరకు అలియాడ్ ఆర్టిస్ట్ వేదికలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మెడోడి, రొమాంటిక్ సింగర్, ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డా. ఎన్.ఇందిర మూడుభాషల ఆణిముత్యాల్లాంటి పాటలను సుమధురంగా ఆలపించి ఆహుతులను సినీసంగీతలోకంలో విహరింపజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ డా. పివిపి అంజనీకుమార్ కృషి పట్టుదల నిరంతర కృషి సాధనతో సాధించలేనిదేదీ ఉండదని, ఈ ప్రతిష్టాత్మక రికార్డును సొంతం చేసుకున్న ఇందిర అభినందిస్తూ మున్ముందు ఇలాంటి మరెన్నో రికార్డులను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

## టెండర్లను ఎందుకు పిలవలేదని జిఎంను ప్రశ్నించిన కార్పొరేటర్



జీఎం సంతోష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పోరేటర్

**నాచారం, మే 5 ప్రభాతవార్త :** నాచారం డివిజన్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరై రెండు నెలలు గడుస్తున్నా టెండర్లను ఎందుకు పిలుస్తలేరని జలమండలి జీఎం సంతోష్‌ను కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ ప్రశ్నించి వినతిపత్రాన్ని అందజేశారు. ఎప్పల్ ఎమ్మెల్యే సహకారంతో జలమండలి ఎండి అశోక్ రెడ్డి ద్వార నాచారం డివిజన్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం నిధులు కెటాయించేందుకు కృషి చేశారు. ఈ ఘటన జరిగి రెండు నెలలు గడుస్తున్నా సంభందిత జీఎం సంతోష్ ఎలాంటి టెండర్లను పిలువలేదు. దీంతో మరో సారి కార్పోరేటర్ జీఎంను కలిసి వినతిపత్రాన్ని అందజేసి త్వరిత గతిన సమస్యను పరిష్కరించాలని కోరారు.

## వేంకటేశ్వర స్వామి శత వార్షికోత్సవ వేడుకలకు హాజరైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ఆలయాన్ని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తధితరులు

**మెట్టుగూడ, మే 5 ప్రభాతవార్త :**
మెట్టుగూడలోని శ్రీ ఉమా మహేశ్వర సహిత వేంకటేశ్వర స్వామిని శత వార్షికోత్సవ వేడుకలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిదంగా ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకాళ భైవర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రిని పూర్ణ కుంభం, భాజాతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ దార బోయిన శ్రీనివాస్ యాదవ్, కిషన్ ప్రసాద్, జె.ప్రకాష్, గోవర్ధన్ యాదవ్, రవి, బిజెపి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, దిశకమిటి సభ్యురాలు శారదా మల్లేష్, యూ. మల్లేష్‌తో పాటు పలువురు నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచండి

**-ప్రజావాణిలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతల వినతి**



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆప్‌నేతలు విజయ, జావిద్, బాబూలాల్,సుధారాణి తదితరులు

**హైదరాబాద్, మే 5,ప్రభాతవార్త:**
వేసవి సెలవులు ముగిసే లోపు అన్ని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల మరియు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాని ఆమ్ ఆద్మీపార్టీ నేతలు ప్రజావాణిలో జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ లోని ప్రభుత్వ పాఠశాల స్థితిగతులను తెలుసుకునేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ తమ క్షేత్రస్థాయి కార్యకర్తలు యువ నాయకులతో కలిసి నగరవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కార్యక్రమం చేపట్టింది. ఈ సర్వే ఆధారంగా ఈరోజు ఆమ్ ఆద్మీ పార్టీ సెంట్రల్ జోన్ కమిటీ నాయకులు హైదరాబాద్ కలెక్టర్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని తమాపర్టీ చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల సర్వే నివేదికను హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి గారికి అందజేశారు. ఫిలింనగర్ రౌండ్ టేబుల్ గవర్నమెంట్ హై స్కూల్, హిమాయత్ నగర్ గవర్నమెంట్ హై స్కూల్లో విరిగిపోయిన అపరిశుభ్రమైన మరుగుదొడ్ల వల్ల పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఇది చాలా బాధాకరమని తెలిపారు. 1000 మందికి పైగా చదువుతున్న ఇలాంటి ఎన్నో బడులలో కేవలం ఒకరిద్దరు ఆయమ్మలు ఉండటం వలన మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచలేకపోతున్నారన్నారు. పాఠశాలలో చదువుతున్న పిల్లల సంఖ్య అనుగుణంగా ఆయమ్మలను నియమించుకునేందుకు స్కూల్ మెయిన్టైనెన్స్ ఫండ్‌ను పెంచి హెడ్మాస్టర్లకు అందజేయాలని కోరారు. వేసవి సెలవులు ముగిసి మళ్లీ తరగతులు జూన్ 12 మొదలయ్యేలోపు తాము ప్రస్తావిస్తున్న ఐదు డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ సెంట్రల్ జోనల్ సభ్యులు విజయ మల్లంగి, జావిద్ షరీఫ్, బాబూలాల్ పవర్, సుధా రాణి, షాబాజ్, లేయాకత్, అజీం బెగ్ పాల్గొన్నారు.

## వాణిజ్య సముదాయాలతో కాలనీవాసుల పడుతున్న అవస్థలు తీర్చండి



జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న మాధవరం కాంతారావు

**కెపిహెచ్బి కాలనీ, మే 5 ప్రభాతవార్త:**
కెపిహెచ్బి కాలనీలోని రోడ్ నెంబర్ వన్ నుంచి జేఎన్టీయూ వరకు ఉన్న వాణిజ్య సముదాయాలు వల్ల కాలనీవాసుల ఇబ్బందులు గమనించి ముందుకు వచ్చిన స్వచ్ఛభారత్ అభియాన్ ఫౌండర్ చైర్మన్ మాధవరం కాంతారావుకు పలువురు కాలనీవాసులు సమస్యను వివరించారు. ఇక్కడి ట్రావెల్స్ రోడ్డులో అక్రమంగా వెలిసిన సముదాయాల వల్ల స్థానికుల రాకపోకలకు, పార్కింగ్‌కి ఇబ్బంది కలుగుతుందనీ, అంతేకాకుండా ఆ వాణిజ్య సముదాయాల్లో రద్దీని ఆసరాగా చేసుకొని మహిళలను పోకిరిలు వేధిస్తున్న పట్టించుకునే నాథుడు లేరని కాలనీవాసులు వాపోయారు. అత్యవసర సమయాల్లో గమ్యస్థానాలు చేరుకోలేక చాలా ఇబ్బంది పడుతున్న స్థానికుల ఇబ్బందులు తీర్చడంలో అధికారులు ముందుకు రావడం లేదన్నారు. ఈ సమస్యలన్నింటినీ గమనించి కూకట్పల్లి బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్‌కి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ అభియాన్ సభ్యులు శ్రీకర్ రావు, వినోద్ గౌడ్, నర్వ పవన్, తోట రమేష్, సుధా రవి, రేవతి, గోపి, వెంకటరమణ, ఆకుల రాము, లహరి, భగవంత్ రెడ్డి, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు. సమస్యలన్నీ విని తగిన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి హామి ఇచ్చారు. సమస్యలపై తగిన చర్యలు తీసుకొని యెడల కాలనీవాసులతో కలిసి ప్రజా ఉద్యమం చేపడతామనీ మాధవరం కాంతారావు హెచ్చరించారు.

## అక్రమ వలసదారులు భారత్ దేశాన్ని వీడాల్సిందే : ఎస్.మల్లారెడ్డి




నిరసన ప్రదర్శనలో పాల్గొన్న బిజెపి శ్రేణులు

**కెపిహెచ్బి కాలనీ, మే 5 ప్రభాతవార్త:**
పాకిస్థానీయులు, బంగ్లదేశీయులు, అక్రమ చొరబటలైన రోహ్యంగులను వెంటనే భారతదేశాన్ని వీడాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కూకట్పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులతో కలిసి జాతీయ జెండాలు, ఫ్లెక్సీలు, ప్లెకార్డులు పట్టుకొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ పహల్గమ్ ఘటన దురదృష్టకరమనీ, ఇది హిందూ సమాజంపై జరిగిన దమనకాండ అని వ్యాఖ్యానించారు. బాధ్యతగా వ్యవహరించాలని అనుమానాస్పద వ్యక్తుల ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డెపల్లి రాజేశ్వరరావు, నాయినేని సూర్యప్రకాష్ రావు, అర్శనపల్లి సూర్యారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచేర్ల మహేందర్, రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ, డివిజన్ స్థాయి బీజేపీ, బీజేవైయం నాయకులు, కార్యకర్తలు, మోర్చాల విభాగాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల మహాధర్నాను విజయవంతం చేయాలి

**-అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ**



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలభారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య, తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం నాయకులు

**ముషీరాబాద్, మే 5, ప్రభాతవార్త:** ఈనెల 15న ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జరగబోయే మత్స్యకారుల మహాధర్నాను విజయవంతం చేయాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నరసింహలు పిలుపునిచ్చారు. సోమవారం బేగంబజార్ చేపల మార్కెట్‌ను సందర్శించిన ప్రతినిధి బృందం మహాధర్నా గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి చేపల మార్కెట్ నిర్మాణంపై నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ బేగం బజార్ చేపల మార్కెట్ ప్రారంభంపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. ప్రతిరోజూ వందలాది మత్స్యకార్మిక కుటుంబాలు డ్రైనేజి వాసనతో బురద నీటిలోనే చేపల వృత్తి చేస్తూ అనారోగ్యాలకు గురవుతున్నా పాలకులకు పట్టించుకోవటం లేదంటే, మత్స్యకారులపై పాలక వర్గానికి ఎంత చిత్త శుద్ధి ఉందో అర్థమవుతోందని అన్నారు. బేగంబజార్ చేపల మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మే 15న చేపడుతున్న ఈ మహాధర్నాలో మత్స్యకార్మికులందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మత్స్యకారులు కార్మిక సంఘం రాష్ట్ర మహిళా విభాగం కోకన్వీనర్ బక్కి బాలమని, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ గాండ్ల అమరావతి, బేగంబజార్ జలక్షత్రియ సమాజ్ గంగపుత్ర అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బజరంగ్ సింగ్, బేగంబజార్ ఫిష్ మార్కెటింగ్ అసోసియేషన్ కోశాధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఓంనగర్‌లో బిఆర్ఎస్ నాయకులు పాదయాత్ర



**గోషామహల్,మే 5ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను తాను ఎల్లప్పుడు ముందు ఉంటానని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మునుకుంట్ల ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈమేరకు సోమవారం జాంబాగ్ డివిజన్ పరిధిలోని ఓంనగర్‌లో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూహిందీనగర్ జలమండలి సెక్షన్ మేనేజర్ కులశేఖర్,జిహెచ్‌ఎంసి ఎఇ మహేందర్,విద్యుత్ ఎఇ శ్రీకాంత్‌లతోకలిసి పాదయాత్ర చేసినట్లు చెప్పారు. ఎండకాలంలో కలుషిత నీటి సరఫరాను అరికట్టే విధంగా చూడాలన్నారు. ఓంనగర్‌లోని డంపింగ్ యార్డు,కూలిపోయిన ట్రాన్స్‌ఫార్మార్ ప్రహారీ గోడ సరిచేసినూతన ట్రాన్స్‌ఫార్మార్ ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేస్తే జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి మంచినీటిపైపులైన్ కొరకు నిధులను మంజూరు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఓంనగర్ బస్తీ వాసుల సమస్యలనుపరిష్కరించేందుకుగాను కృషి చేస్తానన్నారు. ఈ పాదయాత్రలో బిఆర్ఎస్ మహిళా నాయకురాలు ప్రియాగుప్త,మైనార్టీ విభాగం అధ్యక్షులు అహ్మద్,బిఆర్ఎస్ నాయకులు బొట్టు సూరి,గౌతమ్,బస్తీవాసులుద్వారపాక మధు,హరిబాబు,రాజ్‌కుమార్,బార్గవ్,స్వరూప్,నవీన్,నిఖిల్,ప్రమోద్,ప్రభుదాస్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఒప్పంద ఉద్యోగిపైన సమగ్ర విచారణ చేపట్టాలి : గలిబే విశాల్

**బేగంబజార్,మే 5 ప్రభాతవార్త:**
నిరుపేద బాధితుల అసమర్ధతను అసరాగా చేసుకుంటూ కాంట్రాక్ట్ ఉద్యోగి అన్ని తానై వ్యవహరిస్తూ రిజిస్ట్రార్లు,సబ్‌రిజిస్ట్రార్లు,అసిసెంట్ రిజిస్ట్రారుకు మాముళ్లకు అప్పగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్న ఆ ఉద్యోగిపైన ఏసిబి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సురక్షణ,యోజన వెల్ఫేర్ సొసైటి వ్యవస్థాపక అధ్యక్షులు గలిబే విశాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకుఆయన గౌలిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 8మంది రిజిస్ట్రార్లు మారినా ఒకేచోట 19 ఏళ్లుగా తిష్టవేసి లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగిపైచర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు 30 నుంచి 40వేల వరకు అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ఒక పర్మ్ రిజిస్ట్రేషన్ లేదా రెన్యువల్ అయిన కావాలంటే వారి వద్ద 5వేల నుంచి10వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. డిఐజి స్థాయి అధికారి అండదండలు ఉన్నాయని విచ్చల విడిగా చేస్తున్నాడని కాంట్రాక్ట్ ఉద్యోగి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు గలిబె విశాల్ తెలిపారు. అతనిపైగతంలో కూడా అనేక ఫిర్యాదు వచ్చిన ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. 8మంది సబ్ రిజిస్ట్రార్ మారిన ఏకంగా 19 ఏళ్ల పాటు ఒకే చోట కాంట్రాక్ట్ ఉద్యోగి విధులను నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. అతనిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని,లేదా ఎసిబి విచారణ చేయాలని కోరారు.

## సూపర్ ట్విన్స్ అంతర్జాతీయ చదరంగంలో అరుదైన ఘనత

**-చెస్‌లో సత్తాచాటుతున్న అమాయా, అనయ్ అగర్వాల్**



తల్లిదండ్రులు కోచ్‌తో అమాయా, అనయ్ అగర్వాల్

**హైదరాబాద్, మే 5,ప్రభాతవార్త:**
హైదరాబాద్‌కు చెందిన సూపర్ ట్విన్స్ అమాయా అగర్వాల్, అనయ్ అగర్వాల్ అంతర్జాతీయ చదరంగ రంగంలో సంచలన విజయాలు సాధించి నగరానికి గర్వకారణమయ్యారు. కేవలం 10 ఏళ్ల వయస్సులో అమాయా అగర్వాల్, రెండేళ్లలోనే ఉమెన్ క్యాండిడేట్ మాస్టర్ టైటిల్ సాధించి, 10 ఏళ్లలోపు బాలికల కేటగిరీలో ప్రపంచ నంబర్2 ర్యాంక్ కైవసం చేసుకుంది. అదే సమయంలో, ఆమె సోదరుడు అనయ్ అగర్వాల్ బోస్నియాలో జరిగిన ఎఫ్ఎం బెజిలీనా ఓపెన్ ర్యాపిడ్ టోర్నమెంట్లో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏకాగ్రా చెస్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ సురేష్ చైతన్య మాట్లాడుతూ, అమాయా అగర్వాల్ బోస్నియాలో జరిగిన ఎఫ్ఎం బెజిలీనా ఓపెన్ చెస్ టోర్నమెంట్లో అద్భుత ప్రదర్శన కనబరిచి, ఫిడే రేటింగ్లో 2004 పాయింట్లు సాధించిందని తెలిపారు. ఏకాగ్రా చెస్ అకాడమీలో కేవలం రెండేళ్ల శిక్షణతో ఈ స్థాయి విజయం సాధించడం తమ అకాడమీకి ఎంతో గర్వకారణమని ఆయన అన్నారు. అదే విధంగా, అనయ్ అగర్వాల్ బుడాపెస్ట్, బోస్నియాలో జరిగిన అంతర్జాతీయ చదరంగ టోర్నమెంట్లలో 100కు పైగా రేటింగ్ పాయింట్లు సాధించి తన ర్యాంక్‌ను మెరుగుపరచుకున్నాడని వెల్లడించారు. సూపర్ ట్విన్స్ తల్లి పనాషా అగర్వాల్ మాట్లాడుతూ, హైదరాబాద్లోని ఇండస్ పబ్లిక్ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న తమ ఇద్దరు పిల్లలు అత్యుత్తమ శిక్షణ అందించి, ఈ ఘనత సాధించేలా ప్రోత్సహించిన ఏకాగ్రా చెస్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ సురేష్ చైతన్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సామాజిక స్పృహకు నిదర్శనం కళాకుసుమాలు

**-కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత డా. ఎన్.గోపి**



కళాకుసుమాలును ఆవిష్కరిస్తున్న గోపి, రాధాకుసుమ, కళావతి, ప్రసాద్, వెంకటరమణ తదితర అతిథులు

**రవీంద్రభారతి, మే 5 ప్రభాతవార్త :** ప్రతీ రచయిత సామాజిక స్పృహతో రచించే ప్రతీ కవిత, రచన జనంలోకి వెళుతుందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు డా. ఎన్.గోపి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనందలహరి సాంస్కృతిక సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ అధ్యక్షురాలు డా. రాధా కుసుమ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.గోపి గౌరవ అతిథులు డా. కె.ఎల్.వి.ప్రసాద్, చొక్కాపు వెంటకరమణ, హరిరమణ, లింగాల సంధ్యారాణి, మైమ్ కళాధర్, కళారత్న మల్లం రమేష్ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత్రి కందగట్ల కళావతి రచించిన కళా కుసుమాలు కవితా సంపుటిని ఆవిష్కరించి, రచయిత్రిని ఎంతగానో అభినందించి పుస్తకం తొలిప్రతిని మైమ్ కళాధర్‌కు అందించి అంకితమిచ్చారు. కళావతి సామాజిక స్పృహ, స్వీయ అనుభవాన్ని జోడించి కళాకుసుమాలు పుస్తకాన్ని రచించారని కొనియాడారు. చివరిగా రచయిత్రి కళావతిని, ఆమె భర్త మైమ్ కళాధర్‌లను ఘనంగా సత్కరించారు. సభాకార్యక్రమానికి ముందు 20మంది కవులు, కవయిత్రులచే జరిగిన కవిసమ్మేళనం, మిమిక్రీ ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి.

### ఉత్తమ లఘుచిత్ర దర్శకుడు నగరకళాకారుడు వసంత్

**- ప్రముఖ సినీదర్శకుడు మోహన్**



వసంత్‌కు ఉత్తమ లఘుచిత్ర దర్శకుడును ప్రదానం చేస్తున్న కె.మోహన్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, మే 5 ప్రభాతవార్త :** ఉత్తమ లఘుచిత్రాల దర్శకుడుగా హైదరాబాద్ నగరానికి చెందిన కళాకారుడు రామడుగు వసంత్ ఎంపికయ్యారు. ప్రముఖ దర్శకుడు దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి వేడుకల్లో భాగంగా రవీంద్రభారతిలోని ప్రివ్యూ థియేటర్‌లో టాలీవుడ్ డైరెక్టర్స్ అసోసియేషన్, రెయిన్ బో చిల్డ్రన్స్ ఫిలిమ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు, ప్రదర్శనలు జరిగాయి. విభిన్నరీతిలో నిర్మించిన టెన్‌టైమ్స్ అనే లఘుచిత్రానికి దర్శకత్వం వహించిన రామడుగు వసంత్ ఉత్తమ దర్శకుడుగా ఎంపికయ్యారు. ప్రముఖ సినీదర్శకుడు కె.మోహన్ ఈ అవార్డును వసంత్‌కు అందజేసి ఘనంగా సత్కరించారు. దీనితోపాటు టెన్‌టైమ్స్ నిర్మాత పద్మావతి విజయలక్ష్మికి కూడా అవార్డు బహూకరించారు. ఉత్తమ దర్శకుడు వసంత్‌కు నటన, ఇంద్రజాలం, రచనలలో కూడా ఎంతో అనుభవం ఉంది. గతంలో పలు షార్ట్ ఫిలిమ్‌లకు కూడా దర్శకత్వం వహించి ప్రశంసలందుకున్నారు.

## షాదీముబారక్ చెక్కులు పంపిణీ



షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**ముషీరాబాద్, మే5, ప్రభాతవార్త:** షాదీ ముబారక్ చెక్కులను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ లబ్ధిదారులకు అందచేశారు. సోమవారం అంబర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన అంబర్‌పేట్ కార్పోరేటర్ విజయ కుమార్‌గౌడ్, నల్లకుంట కార్పోరేటర్ అమృతతో కలసి 42 మందికి చెక్కులు అందచేశారు.

### వరద నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

**-బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, మే 5, ప్రభాతవార్త**
125 గాజుల రామారం డివిజన్ "ఒక్షిత హిల్ వ్యూ" కాలనీలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సోమవారం అధికారులతో కలిసి పర్యటించి కాలనీలో నెలకొని ఉన్న భూగర్భ డ్రైనేజీ, వరదనీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో నెలకొని భూగర్భ డ్రైనేజీ, వరద నీటి సమస్యకు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్. ఈ.చెన్నారెడ్డి, ఈఈ కిష్టప్ప, వాటర్ వర్క్స్ అధికారులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఒక్షిత హిల్ వ్యూ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణ, సురేందర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### 11న వృక్షదామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5కెరన్

**-ఫౌండర్ కళ్యాణి బెల్లంకొండ**



రన్‌బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళ్యాణి, చిన్నారులు దక్షిత, నిత్య, సంతోషి తదితరులు

**హైదరాబాద్, మే 5,ప్రభాతవార్త:**
మదర్స్‌డే ను పురస్కరించుకొని మే 11న వృక్షధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5కె, 3కె, 2కె రన్ ను గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ కళ్యాణి బెల్లంకొండ తెలిపారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అమెరికాలో ఈ ఫౌండేషన్ ను ఏర్పాటు చేశామని, భారత్‌లో రోజురోజుకు తరిగిపోతున్న వృక్ష సంపదను కాపాడడానికి, ప్రజల్లో పర్యావరణంలో వృక్షాల ఆవశ్యకతను తెలియజేయడానికి ఈ రన్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు, గ్రామాలలో నీటి వనరుల పెంపుకు దోహదపడే లక్ష చెట్లను జూన్, జూలై నెలల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో చిన్నారుల పాత్ర చాలా గొప్పగా ఉండనున్నట్లు ఆమె పేర్కొన్నారు. గచ్చిబౌలిలో నిర్వహించే ఈ 4కెరన్ కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలను ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో చిన్నారులు దక్షిత,నిత్య సంతోషి, ప్రణిత దేవరెడ్డి, మురళి చదలవాడ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చింది



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

**సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త:**
రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను కష్టాల పాలు చేసిందని తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్) (టిఆర్ఎస్) విమర్శించింది. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో ఉద్యమం చేపడతామని టిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళు, ఉచిత విద్యుత్, ఎక్స్‌ప్రెస్ బస్‌లలో ప్రయాణం, ఉద్యమకారులకు 250 గజాల స్థలం, జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు, స్వయం సహాయ సంఘాలకు ఒక కోటి వరకు వడ్డీ లేని రుణాలు, రైతు రుణాలు, రైతులకు గిట్టుబాటు ధర తదితర మొత్తం 420 హామీలను ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నప్పటికి ఇచ్చిన హామీలను చేయడం లేదన్నారు. తక్షణమే హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శంకర్‌గౌడ్, రాజు, సురేఖ, శ్యామల, నర్సింగ్, సంపత్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు మంచీనీరు, డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలి



అధికారులతో సమీక్షా సమావేశం జరుపుతున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

**సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్ కార్పోరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ సోమవారం డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ఉన్న మంచినీరు, డ్రైనేజీ సమస్యలపై సంబంధిత ఉన్నతాధికారులతో సోమవారం నాడిక్కడ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్, మహేష్, జగదీష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా నిషేదిత జాబితాలో చేర్చలేదు

**-గోపన్‌పల్లి భూములపై డిప్యూటీ కలెక్టర్ వివరణ**

**సైబరాబాద్ ప్రతినిధి, మే 5 ప్రభాతవార్త**
శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి గ్రామం 127 నుంచి 173 వరకు ఉన్న సర్వేనెంబర్లు, 263 నుంచి 286 వరకు గల సర్వేనెంబర్లలోని భూమిని ప్రస్తుత భూభారతి వెబ్‌సైట్‌లో నిషేదిత భూమిగా కొత్తగా చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఇది గత 20 సంవత్సరాలుగా ఉన్నదేనని శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టరు వెంకారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2005వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పైసర్వే నెంబర్లలో ఉన్న భూమిని భూసేకరణ చట్టం సెక్షన్4(1) ద్వారా ఐటి పార్కు స్థాపనకొరకు యోచించిందన్నారు. ఇందులో భాగంగానే నోటిఫికేషన్ నెంబర్లు జి1/6979/2004, జి1/6980/2004, జి1/6981/2004, జి1/6982/2004, జి1/6983/2004, జి1/6984/2004, జి1/6985/2004, జి1/6986/2004, జి1/6987/2004 విడుదల చేయడం ద్వారా నిషేదిత భూమిగా పేర్కొన్నదని వివరణ ఇచ్చారు. తాజాగా కొన్ని ప్రసార సాధనాల్లో వస్తున్నట్లుగా ప్రస్తుతం ఎటువంటి కొత్త సర్వేనెంబర్లను తాము నిషేదిత భూమి లిస్టులో చేర్చలేదని, అప్పటి సర్వేనెంబర్లనే కొనసాగించామన్నారు.

## కళ్యాణ లక్ష్మి ప్రవేశపెట్టిన ఘనత కెసిఆర్‌దే : ఎమ్మెల్యే తలసాని


కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్,మే 5 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో ఆడ బిడ్డల వివాహానికి ఆర్థిక సహాయాన్ని అందించిన ఘనత మాజీ సిఎం కేసిఆర్‌కే దక్కిందని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 38 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి 13, షాదీముబారక్ 25లకు మంజూరైన చెక్కులను తలసాని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసిఆర్ ఆడ పిల్లల తల్లిదండ్రులకు భారం పడకుండా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి 1 లక్ష 116 చొప్పున ఆర్థిక సహాయం అందించిన ఘనత కేసిఆర్‌కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మి, టీ.మహేశ్వరీ, కురుమ హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషకుమారి, అత్తిలి మల్లికార్జున్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, బాల్‌రెడ్డి,సికింద్రాబాద్ తహశీల్దార్ పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్


ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న 8వ వార్డు డౌటన్ బజార్ ప్రతినిధులు

**కంటోన్మెంట్,మే 5 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. 8వ వార్డు బొల్లారం,డౌటన్ బజార్‌లోని అమరావతి కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ, స్నేహ ఎన్‌క్లేవ్ కాలనీ వాసులు సోమవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ను కలిసి ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జైహింద్ రావ్, విజయ్ కుమార్, నర్సింగ్ రావ్, వాస్‌దేవరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి : జంపన ప్రతాప్


బోయిన్‌పల్లిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జంపనప్రతాప్

**కంటోన్మెంట్,మే 5 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. సోమవారం ఆయన 1వ వార్డు బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్, సంజీవయ్య నగర్, పెద్ద తోకట్ట, అర్యసమాజ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెచ్చి త్వరిత గతిన పరిష్కారం అయ్యే విధంగా కృషి చేసేస్తామన్నారు.

## నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం


ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నేతలు

**కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త:**
భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోనీ కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ జాతీయస్థాయిలో జనగణనతో పాటు కులగణన చేయాలని నిర్ణయించారి, సామాజిక న్యాయం కోసం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ మోండా మార్కెట్ డివిజన్ బి.జే.పి అధ్యక్షుడు జిత్తుగుప్త ఆధ్వర్యంలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ వీరయ్య, రాజగోపాల్, సాయి, శ్రీనివాస్, గణేష్, రాహుల్, అరుణ్, సుభాష్, మహిళా నాయకురాలు కల్పనా, స్రవంతి, సంగీత తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో నిర్మించిన అంబర్పేట్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

## తుకారాంగేట్ సిఐకి అభినందనలు తెలిపిన మాల మహనాడు నేతలు


తుకారాంగేట్ నూతన సిఐ శ్రీకాంత్ రెడ్డిని సత్కరిస్తున్న మాల మహనాడు నేతలు నక్క మధు తదితరులు

**అడ్డగుట్ట,మే 5 ప్రభాతవార్త:** తుకారాంగేట్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్ రెడ్డి, డిఐ శ్రీనివాస్‌లను సోమవారం అడ్డగుట్ట డివిజన్ మాల మహనాడు సంఘం నేత నక్క మధు ఆధ్వర్యంలో మాల మహనాడు నేత నక్క మధు ఆధ్వర్యంలో పోలీస్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాల మహనాడు సంఘం నాయకులు ఆర్.మల్లేశ్, జై.కుమార్, కోటేశ్వర్ రావ్, అమర్, శివ,మహేందర్,రమేష్ బాబు,శోభ, రమాదేవి, ఉమా, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

## బేగంపేట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్

**బేగంపేట మే 5,ప్రభాతవార్త :** బేగంపేట పోలీసు స్టేషన్ నూతన డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ గా జీ.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా బేగంపేట డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న మదుసూధన్‌రెడ్డిని వారాసిగూడా పోలీస్‌స్టేషన్‌కు ఎస్ హెచ్ ఓ గా బదిలీ చేసారు.ఆయన స్థానంలో మధురానగర్ ఎస్ హెచ్ ఓ గా పనిచేస్తున్న జీ.శ్రీనివాస్ ను బేగంపేట డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ గా నియమిస్తూ పోలీసు కమీషనర్ సీ.వీ.ఆనంద్ ఉత్తర్వులు జారీ చేసారు.2009 పోలీసు బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ గాంధీనగర్,అఫ్జల్‌గంజ్,ఎస్సార్‌నగర్,హుమయూన్‌నగర్,కామాటిపురా, అబిడ్స్ తదితర పోలీసు స్టేషన్లలో విధులు నిర్వర్తించారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీ.శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలమేరకు ప్రజలు ,సిబ్బంది సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

## స్థానిక ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేస్తాం : డాక్టర్ దిడ్డి సుధాకర్

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త**
స్థానిక ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేస్తామని అమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చినన పిలుపు మేరకు స్థానిక సమస్యల పరిష్కారానికి ఇంటి ఇంటికి పాద యాత్ర నిర్వహించారు. సోమవారం రామంతాపూర్, సాయిచిత్ర కాలనిలో ఉప్పల్ ఏరియ భాద్యులు సుధారాణి అద్వర్యంలో పాద యాత్ర నిర్వహించారు.ఈ పాద యాత్ర కార్యక్రమాన్ని డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనిలో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకొన్నారు.రోడ్డు ప్రక్కన వున్న చెత్త, చెట్ల కొమ్మలు పడి వుండటం అమనించి స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పోర్టల్‌లో ఆన్ లైన్‌లో కంప్లైంట్ రిజిస్టర్ చేశారు. అనంతరం డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు అందరు గమనిస్తున్నారని, దేశ, రాష్ట్ర రాజ కీయాలలో ప్రత్యామ్నయం అవసరం ఏర్పడిందన్నారు. బిజెపి దేశ భక్తి, దైవ భక్తీ పేరుతొ ప్రజల మద్య చిచ్చు పెట్టి ఓట్లను సంపాదించు కొంటోందని, రాష్ట్రంలో గత సంవత్సరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు.చేసిన వాగ్దానాల అమలులో పిల్లి మొగ్గలు వేస్తుందని, కొద్ది కాలంలోనే ప్రజలకు తాము గెలిపించిన పార్టి పై నమ్మకాలు సన్నగిల్లాయని పేర్కొన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణా రాష్ట్రంలో ప్రత్యామ్న్యాయ రాజకీయ శక్తిగా ఎదిగే వాతావరణం నేడు ఆసన్నమైందన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఒంటరిగా బరిలో నిలుస్తుందని, గణనీయమైన సీట్లు సాధిస్తామని ఆన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీ చేయడానికి యువతను ఆహ్వానిస్తున్నామని, అందుకు తమ వెబ్ సైటులో టికెట్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉప్పల్ ఏరియా పార్టీ భాద్యులు సుధారాణి మాట్లాడుతూ గతంలో రామంతాపూర్ చెరువు నిండి నివాసాలు మునిగినప్పుడు తాను ప్రభుత్వం తో పోరాడి పైపు లైన్లు వేసిన సంగతి గుర్తు చేశారు. నేడు తిరిగి చెరువులో చెత్త వేస్తున్నారని, డ్రైనేజి దుర్గంధం వస్తోందని, గుర్రపు డెక్కలు కూడా పెరుగు తున్నాయని అన్నారు.చెరువు చుట్టు 70పైన కుటుంబాలు నివసిస్తున్నయని వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆ కుటుంబాలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు విజయ్ మల్లంగి, డాక్టర్ లక్ష్మానాయుడు,జావీద్ షరీఫ్, రమ్య గౌడ్,అజీమ్ బైగ్,శహబాజ్, ఎస్ యెన్ రెడ్డి,ఆహాసాన్ అబ్బాస్,రేకేష్ రెడ్డి,మోనిక గాజుల ,షీలా,శ్రీలత, రాకేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు



రామంతాపూర్‌లో ఇంటింటికి అమ్ ఆద్మీ పార్టీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్, చిత్రంలో సుధారాణి తదితరులు ఉన్నారు.

## డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కను కలిసిన పవర్ ఇంజనీర్స్ నేతలు

-అసిస్టెంట్ ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించడం పట్ల హర్షం

**హైదరాబాద్, మే 5,ప్రభాతవార్త:**
2012 బ్యాచ్‌కి చెందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు అసిస్టెంట్ డివిజనల్,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్లు ఇచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈమేరకు సోమవారం ప్రజాభవన్లో టిజిపిఈఎ అధ్యక్ష, కార్యదర్శులు పి రత్నాకర్ రావు,పి సదానందం మంత్రిని కలిసి పూలబొకే,శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ జాతికి అంకితం చేయడానికి అనుగుణంగా ఇంజనీర్లకు పోస్టింగ్ ఇచ్చినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. గత 15 ఏళ్లగా ఇంత పెద్ద సంఖ్యలో 209 మందికి పదోన్నతులు కల్పించడం ఇదే మొదటిసారి అన్నారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో గత రబీ సీజన్లో అత్యధిక పవర్ డిమాండ్ తట్టుకుని సరఫరా చేయగలిందని అలాగే వేసవిలో అధిక పవర్ డిమాండ్ ను మంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో, జెన్కో సిఎండి సందీప్ కుమార్ సుల్తానియా,సీఎండీలు కృష్ణ భాస్కర్, ముషారఫ్ ,వరుణ్ రెడ్డి గారి నాయకత్వంలో అన్ని రకాల విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్తును అందజేసే లక్ష్యంతో ఇంజనీర్లు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.


భట్టివిక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రత్నాకర్‌రావు, సదానందం తదితరులు

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఆరేపల్లి మోహన్


జై బాపు,జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్,హైదరాబాద్ డిసిసి అధ్యక్షులు సమీర్ వలీవుల్లా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నగేష్

**చార్మినార్,మే 5 ప్రభాతవార్త :** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని,పాతబస్తీలో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు చురకుగా పాల్గొని విజయవంతం చేయాలని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమం ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ అన్నారు.చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో సోమవారం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి బోయ నగేష్ అధ్వర్యంలో జరిగిన జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి బోయ నగేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బస్తీలలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించటానికి నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షులు సమీర్ వలీ ఉల్లా,టిపిసిసి ప్రధాన కార్యదర్శి కె.వెంకటేష్ ముదిరాజ్,హైదరాబాద్ జిల్లా పిసిసి కోఆర్డినేటర్లు సుబ్రహ్మణ్యం,సురేష్,డివిజన్ అధ్యక్షులు,బ్లాకు అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్కులో సుందరీకరణ పనులు పరిశీలన


అధికారులతో కలిసి పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

**వివేకానంద నగర్ కాలనీ, మే 5, ప్రభాతవార్త:**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ డివిజన్ పటేల్‌కుంట పార్క్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ రోజాదేవి రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాటర్ పౌండ్, యోగా షెడ్, సీసీ కెమెరాలు, వాకింగ్ ట్రాక్ పనులను వర్షాకాలం రాకముందే వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, హెచ్ఎండిఏ డిఈ రామారావు, ఏఈ నైనా శ్రీ, ఆర్కిటెక్చర్ శ్రీలేఖ, చెన్నారావు, రవీందర్రావు, జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


హెచ్ఎఫ్‌నగర్‌లో సన్న బియ్యం లబ్దిదారుల ఇంట్లో భోజనం చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


బోరబండ వినాయక నగర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సతీమణి సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా.

**యూసుఫ్‌గూడ, మే 5, ప్రభాతవార్త :**
ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేమని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా అన్నారు. సోమవారం బోరబండ డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదేవిధంగా బస్తీలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు ఆనంద్‌కుమార్, సి.వెంకటేష్, జాన్ వెస్లీ, భరత్, మహేదర్ గౌడ్, నాగమణి, మహేశ్వరిగౌడ్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతశిఖరాలను చేరుకోవాలి

**యూసుఫ్‌గూడ, మే 5, ప్రభాతవార్త :**
విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నశిఖరాలకు చేరుకోవాలని పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న స్కూళ్లన్ని మర్చిపోకుండా తిరిగి ఓ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆఫ్ తెలంగాణ ఐఏఎస్ జయేష్ రంజన్ అన్నారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్ అల్యుమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో పరంపర దీంతో వేడుకలు వైభవంగా నిర్వహించారు. గీతాంజలి అల్యుమిని పేరిట పూర్వపు విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆటపాటలతో జానపద సాంప్రదాయ, ఆధునిక నృత్యాలతో ఆలోచింపజేసే నాటక ప్రదర్శనలతో అలరించారు. అల్యుమిని అసోసియేషన్ సభ్యుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పలు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. అల్యుమిని అసోసియేషన్ సభ్యులు ఆదిత్య మందన, అనూప్ యామ, డాక్టర్ రోహిత్ తపాడియా, కుష్ లుల్లు, కుష్ అగర్వాల్, రోహిత్ బమ్మి, త్రిషచంద్ర పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : అరెకపూడి గాంధీ


లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న అరెకపూడి గాంధీ

**వివేకానంద నగర్ కాలనీ, మే 5, ప్రభాతవార్త:**
ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం వివేకానంద నగర్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆయన నివాసం వద్ద కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి కూకట్‌పల్లి మండలం పరిధిలోని ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్, హైదర్ నగర్, కూకట్‌పల్లి పార్ట్ కాలనీలోని షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ఆడబిడ్డలకు దేశంలో ఎక్కడా లేని విధంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశ పెట్టడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, అక్తర్, ఇబ్రహీం, సమ్మారెడ్డి, ఖాసిం, మహమ్మద్ బేగ్, మోజెస్, అష్రఫ్, కరీం, నరసయ్య, మంజుల, జుబేదాబేగం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చేసిన అభివృద్ధే జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలిపిస్తుంది : అదం సంతోష్ కుమార్

**సికింద్రాబాద్, మే 5 ప్రభాతవార్త:**
రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేసి పార్టీని గెలిపించాలని సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జ్ అదం సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు విస్తృతస్థాయి సమావేశం సీతాఫలమండిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ పర్యవేక్షుడు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, శంషాబాద్ మాజీ సర్పంచ్ సిద్ధేశ్వర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడుగా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల అమలుతో ప్రజలలో పార్టీ పట్ల సానుభూతి పెరిగిందని, పథకాలే ప్రచారస్త్రాలుగా వినియోగించుకొని ఎన్నికల్లో విజయం సాధించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలను చైతన్యవంతం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటేసేలా చూడాలని కోరారు. అదం సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయడం కోసం కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని చెప్పారు. బూత్‌స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు టార్గెట్‌లు పెట్టుకొని పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్ గౌడ్, సందీప్‌రాజ్, షకీల్‌ఖాన్, మాదిరెడ్డి జలందర్ రెడ్డి, కిషోర్ యాదవ్, అనిల్ కుమార్, అభిషేక్, రవి, బ్రహ్మాజీ, గంటరాజు, ప్రభాకర్, సతీష్, జగ్గూ, సురేష్ లాల్, మహేందర్, శంకర్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అదం సంతోష్‌కుమార్

## గద్దార్ ఐకాన్ అవార్డు2024 గ్రహీతకు అభినందనల వెల్లువ

**కుత్బుల్లాపూర్, మే 5 ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన గద్దార్ ఐకాన్ అవార్డు2024కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్టకు చెందిన ఉద్యమకారులు, గాయకులు, సమాజ ప్రేమికులు శివరాత్రి యాదగిరిని వరించడంపట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తాయి. సాయి ఆలేఖ్యసాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని బాస్కర ఆడిటోరియంలో ఈఅవార్డును అందజేశారు. 1992నుండి కవిగా, తెలంగాణ పోరాటయోధుడిగా గుర్తింపు పొందిన శివరాత్రి యాదగిరి సోమవారం నగరంలో గద్దార్ ఐకాన్‌అవారు2024ను స్పీకర్ గడ్డంప్రసాద్, ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మెన్ పటేల్ రమేశ్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతికశాఖ ఛైర్మెన్ వెన్నెలగద్దార్, గాయకురాలు మిమలక్కల చేతులమీదుగా ఆయన ఈ ఆవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిద కాలనీలు, బస్తీలనుండి పెద్దఎత్తున శివరాత్రి యాదగిరిని అభినందించి సత్కరించారు. 1992నుండి ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లలో కవితలు, పాటలనిర్వాహణలో ముందువరసలో ఉంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ అవార్డును బహుకరించి తనపై మరింతబాధ్యతను ప్రభుత్వం పెట్టిందని తెలిపారు. ప్రముఖ కవులు, కళాకారులు దరువు అంజన్న, వరంగల్ శ్రీనివాస్,కోదారి శ్రీనివాస్ కవులు, కళాకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తెలంగాణకోసం తనదైనశైలిలో ఉద్యమించి జెఏసి ఛైర్మెన్‌గా, చైతన్య కళానికేతన్ వ్యవస్థాపక ఛైర్మెన్‌గా, జగద్గిరిగుట్ట చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరిని బోకేలు, షాలువాలతో సత్కరించి అభినందించారు.


స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతులమీదుగా గద్దార్ ఐకాన్ అవార్డు2024ను స్వీకరిస్తున్న కుత్బుల్లాపూర్ మగ్థూంనగర్‌కు చెందిన శివరాత్రి యాదగిరి

## ప్రజలకు అందుబాటులో ఉంటున్నా : రాజ్‌మోహన్


అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

**పురానాపూల్,మే 5ప్రభాతవార్త:**
దాదాపు ఇరువై సంవత్సరాలుగా పురానాపూల్ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను కృషి చేయడం జరుగుతుందని డివిజన్‌మజ్లీస్ కార్పొరేటర్ సున్నంరాజ్ మోహన్ అన్నారు.సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని చిన్నబజార్ ,కబుతర్ ఖానా ప్రాంతంలో సిసిరోడ్డు అభివృద్ధి పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ తాను 20సంవత్సరాలుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎంపి,ఎమ్మెల్యే సహకారంతోఅనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు.కులమతాలకు అతీతకంగా ప్రజా సమ్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో మజ్లీస్ నాయకులు,జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## కవులు సాహితీవేత్తల హైందవ శంఖారావం కవిసమ్మేళనం

**రవీంద్రభారతి, మే 5 ప్రభాతవార్త :**
భారత్ వికాస పరిషత్తు తెలంగాణ ప్రాంతం, బివిపి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల కాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద మారణకాండను నిరసిస్తూ కవులు, సాహితీవేత్తల హైందవ శంఖారావం పేరుతో కవిసమ్మేళనం నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నాగశేఖర్‌గుప్తా, పోషకులు సిహెచ్.హనుమంతరావు, ఆచార్య ముదిగొండ శివప్రసాద్, మావుదూరు సూర్యనారాయణమూర్తి, ఇందుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
మల్కాజిగిరి సర్కిల్-28
నిట్ నెం. 07/EE-28/SBZ/GHMC/2025-26
పని పేరు: నిర్వహణ పనులు ఇతరములు -08. అంచనా మొత్తం (రూ.లక్షలలో) : 284.40. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం, బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 06.05.2025 మ.12.30గం. మరియు 13.05.2025 మ.12.30గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 9154796465, 7331189186. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, GHMC.
DIPR.NO.1376-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 05.05.2025

IN THE COURT OF THE XX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD.
O.S.NO. 1855 OF 2025
Between: -
Vennu Laxman Rao and others. ...Plaintiffs.
AND
The Tahsildar, Bahadurprua Mandal and another ...Defendants.
To:
All concerned. .....Defendant No.2
The above named plaintiffs had filed the above suit O.S.No.1855 OF 2024 on the file of the Hon'ble XX Junior Civil Judge, city civil court, at: Hyderabad, for declaration to declare that the plaintiffs are the legal heirs of Late Vennu Srinivasa Raoand for other reliefs. The said suit O.S.No.1855 of 2024 is posted to 17-06-2025for the objections, if any from the objectors, before the said Hon'ble Court either in person or through an Advocate at 10-30 A.M. failing which the matter will be decided ex-parte.
(By order of the Court)
M/S. NAGA ANIL KUMAR, P.S. TEJAS
ADVOCATES FOR PLAINTIFFS
(O): Flat No. 214, Lingapur House, Himayathnagar, Hyderabad-29,
Mail:naga_anilkumar2000@yahoo.com
Cell: 9849240738, 8885264330

DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)
1st Floor, Triveni Complex, Abids, Hyderabad 500001
Case No: OA. 543 of 2024
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.
BANK OF INDIA, Ramakrishnapuram Branch ...Applicant
VS
M/s Manna Systems Private Limited and others ...Defendants
To,
1. M/s Manna Systems Private Limited Plot No.1-4-210/41, Pradhampuri Colony, Near Netajji Nagar X Roads, ECIL, Hyderabad 500062
2. Mr. Zachariah Jonnalagadda S/o Charles, Age.43 years, Occ : Business, Male House no 10-3-224/1, Plot no 96 and 97 parts, Santosh Nagar Colony, RL Nagar Rampally village Keesara Mandal, Medchal Malkajgiri District, Telangana – 501301
3. Mrs Shobha Rani Peril W/o Mr. Zachariah Jonnalagadda Age about 39 years, Occ : Business, Female House no 10-3-224/1, Plot no 96 and 97 parts, Santosh Nagar Colony, RL Nagar Rampally village Keesara Mandal Medchal Malkajgiri District Telangana- 501301
SUMMONS
WHEREAS, OA/ 543/2024 was listed before Hon'ble Presiding Officer/Registrar on 22-04-2025.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.1,11,34,861.72 ps (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii)to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii)you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Registrar on 11-06-2025 at 10:30A.M. failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: 05-05-2025.
Signature of the Officer Authorised to issue Summons.

DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)
1st Floor, Triveni Complex, Abids, Hyderabad 500001
Case No: OA. 618 of 2024
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.
BANK OF INDIA, Ramakrishnapuram Branch ...Applicant
VS
Mr. Zachariah Jonnalagadda and others ...Defendants
To,
1. Mr. Zachariah Jonnalagadda S/o Charles Age.43 years, Occ : Business, Male House no 10-3-224/1, Plot no 96 and 97 parts, Santosh Nagar Colony, RL Nagar Rampally village Keesara Mandal, Medchal Malkajgiri District, Telangana-501301
2. Mrs Rani Peril Shobha Rani Age about 39 years, Occ : Business, Female House no 10-3-224/1, Plot no 96 and 97 parts, Santosh Nagar Colony, RL Nagar Rampally village Keesara Mandal Medchal Malkajgiri District, Telangana-501301
3. Mr Nageswara Rao Pulagam Age years, Occ: business, Male Plot No.43, Sheshadri Colony, RL Nagar, Rampally, Keesara Mandal, Medchal Malkajgiri District, Telangana-501301
SUMMONS
WHEREAS, OA/618/2024 was listed before Hon'ble Presiding Officer/Registrar on 22/04/2025.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.36,54,698.63 ps (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii)you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv)you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v)you shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Registrar on 29-05-2025 at 10:30A.M. failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: 05-05-2025.
Signature of the Officer Authorised to issue Summons.

